www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 24 జులై 2025

5

చిత్తూరు



ఒప్పంద అధ్యాపకుల కొనసాగింపుకు
నేడు కౌన్సెలింగ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో గత విద్యా సంవత్సరం 2024-25 అనగా ఏప్రిల్ 30వ తేదీ వరకు పనిచేసిన ఒప్పంద అధ్యాపకుల పని కాలాన్ని 2025-26 విద్యా సంవత్సరానికి కొనసాగింపు కొరకు చిత్తూరు నగరంలోని పివికేఎన్ ప్రభుత్వ కళాశాలలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేసే ఒప్పంద అధ్యాపకులు కొనసాగింపు కొరకు కౌన్సెలింగ్ గురువారం ఉదయం 10గంటలకు పివికేఎన్ ప్రభుత్వ కళాశాలకు హాజరు కావాలని కోరారు.

జాతీయ రహదార్లపై
నెత్తుటి మరకలు

- తరచూ ప్రమాదాలు.. తగ్గని మరణాలు..


వేలూరు- చిత్తూరు జాతీయ రహదారిలో లోయలోకి దూసుకెళ్ళిన కంటైనర్ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జాతీయ రహదార్లపై నెత్తుటి మరకు చెరగడం లేదు.. మొగిలి ఘాట్ రోడ్డులో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక శ్రద్ద తీసుకుని వేగనియంత్రణ కోసం స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలు మొగలి ఘాట్‌రోడ్డుపై పోలీస్ నిఘా ఉంచారు. వేగ నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అత్యంత వేగంగా ఘాట్ రోడ్డులో భారీ వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకుంటున్నారు.

చిత్తూరు- బెంగళూరు హైవేలో ఏపీఎస్ ఆర్టీసీ బస్సు లారీని ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో 23 మంది మృతి చెందిన ఘటనలో తరువాత రోడ్డు ప్రమాదల నివారణ కోసం తీసుకున్న చర్యల వలన మొగిలి ఘాట్ రోడ్డులో గత ఎనిమిది నెలలుగా రోడ్డు ప్రమాదాలు కాస్తా తగ్గాయనే చెప్పాలి. అలాగే చిత్తూరు -వేలూరు ఎన్‌హెచ్ -4 జాతీయ రహదారిపై ఏడాది కాలంలో రోడ్డు ప్రమాదాల్లో 14 మంది మృతువాత పడ్డారు, 46 మంది గాయపడ్డారు. చిత్తూరు- వేలూరు జాతీయ రహదారి నిర్మాణం వందశాతం పూర్తికాకపోవడం, సూచిక బోర్డులు లేకపోవడం, ప్రమాదకర మలుపులే పలు ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది. మంగళవారం అర్ధసంవత్సర జిల్లా నేర సమీక్షా సమావేశంలో చిత్తూరు- వేలూరు జాతీయ రహదార్లపై చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలపై విస్తృత చర్చ జరిగింది. నంగమంగళం వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జ వద్ద ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం లేవు, ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంత తరచూ ఇక్కడ వాహనదార్లు ప్రమాదాలకు గురైతున్నారు.

రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రయాణికులకు రక్షణ కల్పించేలా ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశాలు ఆరు నెలలకోసారి జరుగుతున్నా రోడ్డు ప్రమదాలు నియంత్రణ కావడం లేదు. ప్రమాదాలు చోటు చేసుకుంటున్న సందర్భాల్లో తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలున్నాయి. ప్రమాదాలు సంభవించక ముందే ముందస్తు చర్యలు తీసుకుంటే ప్రజల ప్రాణాలను కాపాడవచ్చు... తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న యాక్సిడెంట్ స్పాట్లను గుర్తించి సూచిక బోర్డులు, రేడియం స్టికర్లు ఏర్పాటు చేయాలి. గుడిపాల మండలం పానాటూరు వద్ద గత నెలలలో ద్విచక్రవాహనాన్ని బోలోరా ఢీ కొనడంతో చిత్తూరుకు చెందిన నాగరాజు గాయపడ్డారు. గత నెల 3వ తేదీన బొమ్మసముద్రం వద్ద ఆర్కాట్‌కు చెందిన ప్రభాకర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈనెల 13వ తేదీ చిత్తూరు -వేలూరు జాతీయ రహదారి పానాటూరు వద్ద భారీ కంటైనర్ అదుపుతప్పి రోడ్డుపక్కన లోయలోకి దూసుకెళ్ళడంతో డ్రైవర్ సతీష్ గాయపడ్డారు. ఇలా తరచూ చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చీలాపల్లి వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాలను అరికట్టేలా అసంపూర్ణంగా జాతీయ రహదారి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


పానాటూరు వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నాగరాజు (ఫైల్‌పోటో)

టమాటా ధరలు పైపైకి..

- తగ్గుతున్న దిగుబడి
- వర్షాలతో మచ్చలు, బూజు తెగులు


ప్రజాశక్తి- పుంగనూరు

ఓ వైపు టమాటా ధరలు రోజురోజుకు పెరుగుతుంటే మరో వైపు సాగు విస్తీర్ణం దిగుబడి మాత్రం తగ్గుతూ వస్తోంది.. రెండు నెలల క్రితం టమాటా పంటకు ధర లేకపోవడంతో రైతులు తీవమైన నష్టాలను చవిచూశారు. కనీసం గిట్టుబాటు ధర కూడా లేకపోవడంతో చాలా మంది రైతులు పంటను కోయకుండానే పొలాల్లో వదిలేశారు.. మరి కొందరు పశువులకు వేతగా వేశారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోగా నష్టా ఊబిలో కూరుకుపోయారు. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. టమాటా పంటతో రైతాంగం కోలుకోలేని దెబ్బ కొట్టింది.



ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో కిలో రూ.3 నుంచి 4లు వరకు ధరలు ఉండగా ప్రస్తుతం పుంగనూరు వ్యవసాయ మార్కెట్లో మొదటి రకం టమాటా కిలో రూ.35 నుంచి 40లు, రెండో రకం కిలో రూ.32 నుంచి 70లు, మూడవ రకం కిలో రూ.29 నుంచి 40లు ధరలు పలుకుతున్నాయి. నాణ్యతను బట్టి టమాటాల ధరలు నిర్ణయిస్తారు. ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. పుంగనూరు వ్యవసాయ మార్కెట్ నుండి తమిళనాడు రాష్ట్రంలోని మధురై, తిరుచ్చి, పేని, చెన్నై, ఈ రోడ్డు, తిరునామలై, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైజాగ్, అనకాపల్లి, శ్రీకాకుళం, కాకినాడతో పాటు ఒరిస్సా, కలకత్తా ప్రాంతాలకు టమాటాల ఎగుమతులు నిత్యం జరుగుతూ ఉంటాయి. ప్రస్తుతం బుధవారం పుంగనూరు మార్కెట్‌కు 311.73 మెట్రిక్ టన్నులు టమాటా వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పుంగనూరు నియోజకవర్గంలో అత్యధికంగా సీజన్ ప్రారంభంలో టమాట పంట సాగు చేశారు.



గిట్టుబాటు ధర లేక పశువుల మేతగా, మరి కొన్నిచోట్ల పొలంలోని పంటను వదిలివేయడం జరిగింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంటకు నల్ల మచ్చలు, బూజు తెగులు వ్యాధులు సోకే ప్రభావం ఉన్నట్టు ఉద్యానవన శాఖ అధికారులు తెలుపుతున్నారు. కురుస్తున్న వర్షాలతో రసం పీల్చే పురుగులు, ఫంగల్ వ్యాధి ఆకులపై ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధుల బారిన పడకుండా ఉద్యానవన శాఖ అధికారులు సూచించే సూచనలు పాటించాల్సి ఉంది. ఉద్యానవన శాఖ పరిధిలో పుంగనూరు మండలంలో 1200 ఎకరాల్లో, పెద్దపంజాణి 450, గంగవరం370 ఎకరాలలో టమాటా పంట సాగులో ఉన్నట్టు తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారులు సూచించే సూచనలు పాటిస్తూ పంటను కాపాడుకుంటే మరింత దిగుబడితోపాటు లాభం రైతులకు వచ్చే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

వాహనాలు ఇలా.. రాకపోకలు ఎలా..?

- అవస్థలు పడుతున్న నివాసిత ప్రజలు

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండల కేంద్రంలో వాహనాల పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోవడంతో.. ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చిన వాహనచోదకులు తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసి వెళ్తుతున్నారు. మరి ముఖ్యంగా వీధుల్లో భారీ ఎత్తున ద్విచక్ర వాహనాలు పెడుతుండడంతో స్థానిక నివాస ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక వీధుల్లోని ప్రజలు వారి కార్లను ఈ వీధుల్లో బయటకు తీసుకురావడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో అయితే ఏకంగా వీధుల్లో నివసిస్తున్న వారికి.. ద్విచక్ర వాహన చోదకులకి గొడవలు జరిగిన సందర్భాలు కూడా అనేకం. వీధుల్లో ద్విచక్ర వాహనాలు పెట్టడం వల్ల తమ వాహనాలను బయటకు తీయడానికి ఇబ్బందికరంగా ఉందని అనేకమార్లు స్థానిక ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ప్రతి మంగళవారం మండల కేంద్రంలో వారపు సంత జరుగుతున్న నేపథ్యంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో వాహనాలు ఆపకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా బజారు వీధిలో ఇలాంటి పరిస్థితులు అధికంగా ఉన్నాయి.


బజారు వీధిలో రాకపోకలకు ఇబ్బందికరంగా నిలిచి ఉన్న వాహనాలు

షికారి పాలెంలో సమస్యల తిష్ట

- కూలడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు..
- ఏళ్లు గడిచినా మారని బతుకులు
- ఇంటి బయటనే వంటలు

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం)

పలమనేరు రూరల్‌లో దశాబ్దాల క్రితం ప్రభుత్వం షికారీలకు పక్కా ఇళ్లను కట్టించి షికారీల కాలనీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఆ ఇళ్లు ఎప్పుడు ఏ క్షణం కూలిపోతాయో తెలియని పరిస్థితి. వర్షం వచ్చిందంటే ఇంటి పైకప్పు నుంచి వర్షపు నీరు ఉరుస్తూనే ఉంటుంది. ఉన్న చిన్నపాటి ఇంటిలో వంట చేసుకోవడానికి స్థలం సరిపోకపోవడంతో మహిళలు ఆరుబయట కట్టెల పొయ్యిపైనే వంట చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించినప్పుడు ఎన్‌టి రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సయంలో ఈ కాలనీకి ఇళ్లు మంజూరైంది. ఇక్కడ దాదాపు 50 కుటుంబాల వరకు షికారీలు ఇవే ఇళ్లలో జీవనం సాగిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ కాలనీకి వీధిలైట్లు లేవు, కనీస మౌలిక వసతులు లేవు.. చీకటిలో చంటిపిల్లలతో ఇరుకు గదుల్లో నానా అవస్థలు పడుతున్నామని షికారీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి పైకప్పులు ఎప్పుడు ఊడి మీద పడుతాయోన్న భయంతో జీవనం సాగిస్తున్నామని వాపోతున్నారు. ఈ కాలనీకి


ఊరుస్తున్న ఇంటి పైకప్పులు

పలమనేరు పట్టణానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉందని, పక్కనే బెంగళూరు - చెన్నై రహదారి కూడా ఉంది. పట్టణానికి అతి దగ్గరలో ఉన్న కాలనీ ఇంత దారుణ పరిస్థితి ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపానపోలేదని, పలుమార్లు తమ కాలనీ గురించి పట్టించుకోవాలని నాయకులకు వినతులు ఇచ్చినా ప్రయోజనం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో నివాసముంటున్న శరత్ నాయక్ మాట్లాడుతూ తమ జీవనం కోసం చిన్నచిన్న వస్తువులను గ్రామాల్లో అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నామని, ప్రస్తుతం మహిళల జీవన శైలి మారడంతో తమ వ్యాపారం పూర్తిగా తగ్గిపోయిందని వాపోయాడు.

గ్రామాల్లో వ్యాపారం చేయడానికి వెళ్లి తిగిరి కాలనీకి వచ్చే సమయానికి రాత్రి సమయంలో అవుతోందని లైట్లు లేక చీకటిలోనే ఆరుబయట కూర్చొని కట్టెల పొయ్యి పైనే వంట చేసుకుని తింటున్నామని తెలిపారు. ప్రభుత్వం బలహీన వర్గాలకు అనేక పథకాలు ప్రవేశపెట్టి అన్ని వసతులు కల్పిస్తున్నా తమ బతుకులు మాత్రం ఎందుకు మారడం లేదని ప్రశ్నిస్తున్నారు. తమ పూర్వీకుల నుంచి తమకు ఎటువంటి గుర్తింపు కార్డులు లేవని ఇప్పుడైనా ఆధార్, రేషన్ కార్డులు ఇప్పించాలని కోరుతున్నారు. రేషన్ కార్డు మంజూరు చేయడం వలన తమ పిల్లలు కనీసం ఒక పూటైనా తిండి తింటారని కోరుతున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఆఫీసుల చూట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఇకనైనా అధికారులు స్పందించి తమ కాలనీకి మౌలిక వసతులు కల్పించడంతోపాటు, తమకు రేషన, ఆధార్ కార్డులు ఇప్పించాలని కోరాఉతున్నారు.


ఆరుబయటే వంట చేస్తున్న మహిళలు

కరెంట్ స్తంభానికి అల్లుకున్న తీగలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి పచ్చని చెట్ల తీగలు ఎగబాకుతున్నా.. స్తంభాన్ని, కరెంట్ వైర్లను చుట్టేస్తున్నా.. చూసీచూనట్లు వ్యవహరిస్తున్నా స్థానిక విద్యుత్ అధికారులు. సమస్య కళ్లెదుట కనిపిస్తున్నా ఎందుకు పట్టించుకోరని ప్రశ్నిస్తున్నారు స్థానికులు.. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలోని వెదురుకుప్పం మండలంలో మండల సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో రహదారికి అనుకుని ఉన్న రైతు పొలంలోని విద్యుత్ స్తంభానికి పిచ్చిమొక్కల తీగలు దట్టంగా అల్లుకొని ఎగబాకుతున్నాయి. అదే విద్యుత్ స్తంభానికి 11 కెవి విద్యుత్ తీగలు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఎవరైనా అటువైపు వెళితే కరెంట్ షాక్ తగిలి ప్రమాదానికి గురి అయ్యే పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణనష్టం కలుగక ముందే విద్యుత్తు అధికారులు స్పందించి స్తంభానికి ఉన్న తీగలు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


విద్యుత్ స్తంభానికి దట్టంగా అల్లుకున్న తీగలు

రోడ్డు పేరుతో నిరాశ్రయులను చేస్తున్నారు..


రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన బాధితులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : రోడ్డు విస్తరణ పేరుతో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తమను నిరాశ్రయులను చేస్తున్నారని స్థానిక కట్టమంచి చెరువు కింద కాపురం ఉన్న ఎస్.అమ్ములు అనే బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు అమ్ములు, ఆమె కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం విలేకరుల వద్ద తమ గోడును వెల్లబోసుకున్నారు. గత 45 సంవత్సరాల కితం కట్టమంచి పరిధిలోని గాండ్లపల్లి రెవెన్యూకు చెందిన రెండు సెంట్ల భూమిలో తమ కుటుంబం నివాసముంటున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి తమకు 1993వ సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీన అప్పటి చిత్తూరు మండల తహశీల్దారు పట్టాను సైతం మంజూరు చేశారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో బతుకుదెరువు కోసం తమ పిల్లలు చిత్తూరు నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో బాడుగ ఇళ్లల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు తమ గోడును పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమ ఆధీనంలోని రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గతంలో తహశీల్దార్ మంజూరు చేసిన తమ ఇంటి స్థలానికి ఇప్పటికే పలుమార్లు పన్నులను సైతం చెల్లించామని, అయితే మున్సిపల్ అధికారులు మాత్రం తమ ఇంటికి ఎదురుగా రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోతున్న వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో లంచాలు తీసుకొని, తమ ఇంటి స్థలాలను వారికి కేటాయించేలా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవంగా తమ ఇంటి స్థలం రోడ్డు విస్తరణలో పోతే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే తమ ఇంటి స్థలాన్ని ఇతరులకు కట్టబెట్టాలని చూస్తే మాత్రం సమ్మతించబోమని స్పష్టం చేశారు. ఆరోగ్యం సరిగాలేని తమ ఇంటి పెద్దను సైతం, తమ ఇంటి నుంచి బయటకు పంపి మున్సిపల్ అధికారులు దౌర్జన్యంగా స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ఎటువంటి ప్రత్యామ్నాయాలు చూపకుండానే కూలి నాలి చేసుకుని జీవిస్తున్న నిరుపేదలమైన తమను ఉన్నఫళంగా ఖాళీ చేయాలని చెప్పడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ విషయంలో చిత్తూరు ఎమ్మెల్యే తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఇందుకు సంబంధించి మున్సిపల్ అధికారులు వివరణ కోరగా.. సంబంధిత స్థలం కట్టమంచి చెరువుకు చెందిందని, గత 20 సంవత్సరాలుగా ఆ స్థలంలో ఎవరూ కాపురం లేనందున తాము స్వాధీనం చేసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. బాధితులకు తప్పకుండా ప్రత్యామ్నాయం చూపుతామని వారు ఆ సందర్భంగా హామీ ఇచ్చారు.

నాణ్యమైన పనులు చేపట్టండి

- ఎన్‌హెచ్-40 హైవే పనులను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ


ఎన్‌హెచ్ హైవే రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : నాణ్యమైన పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం గుడిపాల మండలంలోని నంగమంగళం వద్ద రోడ్డు, బ్రిడ్జి పనులను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. గుడిపాల మండలం ఎన్‌హెచ్ -40 హైవేలో జరుగుతున్న రోడ్డు పనులను, నంగమంగళం ఫ్లైఓవర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని కూడలలో ప్రమాదక హెచ్చరికలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సిఎంసి ఆసుపత్రి ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ముఖ్యంగా జంక్షన్స్‌లో రేడియం స్టిక్కర్స్, లైటింగ్, జీబ్రా క్రాసింగ్ లైన్స్, సైన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత కన్స్ట్రక్షన్, సిఎంసి ఆసుపత్రి అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎంసి ప్రతినిధి ప్రిన్సెస్, అధికారులు పాల్గొన్నారు.

టెండర్లు రద్దు చేయాలి..

విద్యుత్తు స్టోర్ హమాలీలకే నామినేషన్ పద్ధతిలో పని ఇవ్వాలి
చిత్తూరు ఎమ్మెల్యేకు సిఐటియు వినతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా కేంద్రంలో విద్యుత్ స్టోర్‌లో పనిచేస్తున్న హమాలీలకే నామినేషన్ పద్ధతిలో పని ఇవ్వాలని, టెండర్లు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ స్టోర్స్ హమాలీ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సురేంద్రన్, జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, విద్యుత్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దాస్ మాట్లాడుతూ విద్యుత్ స్టోర్‌లో గత 40 సంవత్సరాలుగా 25 మంది హమాలీలు పనిచేస్తున్నారని, ప్రస్తుతం వారు సొసైటీగా ఏర్పడి పీస్ రేట్ కింద చాలీచాలని కూలితో పనిచేస్తున్నారని తెలిపారు. కూలి రేట్లు పెంచాలని పదేపదే ఆందోళన చేస్తున్న పరిస్థితి ఉందని, ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇలాంటి కూలీలను అందరికీ ఆదుకుంటామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఏరు దాటే వరకు మల్లన్న-ఏరు దాటాక బోడి మల్లన్న అన్నచందంగా ప్రస్తుతం నడుస్తున్నదని విమర్శించారు. ఇచ్చిన హామీని పక్కనపెట్టి ప్రస్తుతం టెండర్ రూపంలో పిలుస్తామని టెండర్లను ఆహ్వానిస్తున్నదని, టెండర్లు ఆహ్వానించి కొత్తవారు వస్తే సంవత్సరాలు కొద్ది పని చేస్తున్న కార్మికుల ఉపాధి కోల్పోతారని కావున ప్రస్తుతం సొసైటీ తరపున పనిచేస్తున్న కార్మికులకే నామినేషన్ పద్ధతులో పని ఇచ్చి వారి ఉపాధిని నిలబెట్టాలని కోరారు. ఎమ్మెల్యే ఇందుకు సానుకూలంగా స్పందిస్తూ మీరు కూడా టెండర్లు వేయండి పరిశీలిస్తామని తెలిపారు. అయితే యూనియన్‌గా వర్కర్లకే ఇవ్వాలని లేనిపక్షంలో టెండర్లు అడ్డుకుంటామని, రద్దు అయ్యే వరకు పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టోర్స్ హమాలీలు పాల్గొన్నారు.


ఎంఎల్‌ఏకు వినతి చేస్తున్న సిఐటియు నాయకులు

ఎస్పీని కలసిన ప్రొబేషనరి ఎస్ఐలు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాకు కేటాయించిన ఎనిమిది మంది ప్రొబేషనరి ఎస్ఐలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మణికంఠ చందోలును మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలి, విధులను నిజాయితీగా నిర్వర్తించి చట్టపరమైన అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ కుటుంబాలను అన్ని విధాలుగా అదుకోనున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. విధి నిర్వహణలో అనారోగ్యంతో ఈనెల 8వ తేది మృతిచెందిన దయా సాగర్ సతిమణి ప్రసన్నకుమారికి పోలీస్ సహాయ నిధి నుండీ లక్ష రూపాయల చెక్‌ను బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధిత కుటుంబానికి భరోసా ఇస్తూ పోలీస్ డిపార్టుమెంట్ తరపున వారికి అన్ని విధాల సహాయం అందిస్తామని తెలిపారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం అందించే అన్ని న్యాయమైన సౌకర్యాలు, ఫలితాలు కూడా సమర్ధవంతంగా పొందేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఆర్థికసాయం అందిస్తున్న ఎస్పీ



బర్డ్‌కు పూర్వవైభవం

టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు



ప్రజాశక్తి - తిరుపతి సిటి

గత కొంతకాలంగా బర్డ్ ఆస్పత్రి నిర్వీర్యం అయ్యిందని, తిరిగి పూర్వవైభవం తీసుకురావాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు వైద్యులకు సూచించారు. సర్జరీల వెయిటింగ్ సమయాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తిరుపతి శ్రీ పద్మావతి గెస్ట్ హౌస్ లోని సమావేశ మందిరంలో బర్డ్ ట్రస్ట్ నిర్వహణపై బుధవారం టిటిడి ఈవో జె. శ్యామల రావుతో కలిసి టిటిడి ఛైర్మెన్ సమీక్షించారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మెన్ మాట్లాడుతూ బర్డ్‌లో వైద్య సేవలకు గ్రామీణ ప్రాంతాల రైతులకు, నిరుపేదలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సర్జరీలకు వెయిటింగ్ సమయాన్ని తగ్గించేందుకు అవసరమైన మౌళిక సదుపాయాలు, వైద్యులు, సిబ్బంది, మందులు, పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మోకాలి మార్పిడి, తదితర శస్త్ర చికిత్సలకు ఉపయోగించే అవసరమైన విదేశీ పరికరాలను మరింత నాణ్యంగా ఉండే వాటిని ఎంపిక చేసుకుని భారతీయ ధరలకు అనుగుణంగా సేకరించాలని సూచించారు. టిటిడి ఈవో జె. శ్యామల రావు మాట్లాడుతూ శ్రీ పద్మావతీ చిన్న పిల్లల హృదయాలయంలో చిన్న పిల్లల హార్ట్ ఆపరేషన్లకు దాతలు విరాళం ఇచ్చే ఆపన్న హదయ స్కీం ఉందని, అదే విధంగా బర్డ్ లోనూ పేద వర్గాల వారికి సర్జరీలు చేసేందుకు దాతల నుండి విరాళం సేకరించే అంశంపై టిటిడి జేఈవో, ఎఫ్.ఏ అండ్ సీఏవో, బర్డ్ డైరెక్టర్ సంయుక్తంగా నివేదిక తయారు చేయాలని సూచించారు. బర్డ్ ఆసుపత్రిని అందరికి అందుబాటులో ఉండేలా తయారు చేయాలన్నారు. అవసరమైన అధునాతన పరికరాలను నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. డైరెక్టర్ డాక్టర్ జి. జగదీశ్ మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు సర్జరీలను తక్షణం చేస్తున్నామని, జాయింట్ రీప్లేస్మెంట్ లకు ఏడాది సమయం పడుతోందని వివరించారు. బర్డ్ ఆసుపత్రి ప్రారంభం నుండి నేటి వరకు చేపట్టిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, టి. జానకి దేవి, వర్చువల్ ద్వారా డాక్టర్ అదిత్ దేశాయ్, జేఈవో వీరబ్రహ్మం, ఎఫ్ఏ అండ్ సీఏవో ఓ. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో నిర్మాణ పనులు పరిశీలన

స్విమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న వివిధ విభాగాలకు సంబంధించిన భవనాలను టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులకు సూచించారు. పెండింగ్ పనులు, డిజైన్లు, వైద్య పరికరాలు, సిబ్బంది తదితర అంశాలను నిర్ణీత సమయానికి పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. అంతకుముందు స్విమ్స్ ఆస్పత్రి పనుల పురోగతిపై పరిపాలనా భవనంలో ఈవో శ్యామలరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్, టిటిడి ఇంజినీరింగ్ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

రుయా అంతర్గత రోడ్లు తారు రోడ్లుగా...

రుయా ఆస్పత్రిలోని అంతర్గత రోడ్లను తారు రోడ్లుగా మారుస్తున్నారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు బిటి రోడ్లు వేస్తున్నట్లు తుడా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవీంద్ర తెలిపారు. తుడా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవీంద్ర, రుయా ఆర్ఎంఒ డాక్టర్ హరికృష్ణ పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి.

చంద్రగిరి కోటను సందర్శించిన అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - రామచంద్రాపురం(చంద్రగిరి)

చంద్రగిరి కోటను అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బుధవారం సందర్శించారు. సెప్టెంబర్ 14, 15 తేదీల్లో తిరుపతి నగరంలో జాతీయ స్థాయి మహిళా సాధికారత కమిటీ సమావేశాలు జరగనున్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీ మహిళా సాధికారత కమిటీ సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, పార్లమెంట్ స్పీకర్, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో చారిత్రాత్మక కట్టమైన చంద్రగిరి కోటను సభ్యులు సందర్శించనున్నారు. ఈ సమావేశాల ఏర్పాట్లపై తిరుపతికి విచ్చేసిన అయ్యన్నపాత్రుడు తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డితో కలిసి చంద్రగిరి కోటను సందర్శించారు. చంద్రగిరికోట ప్రాశస్త్యాన్ని, విశేషాలను వివరించారు. కమిటీ సభ్యులకు చంద్రగిరి కోటలో మ్యూజికల్ లైట్స్ షో ఏర్పాటు చేస్తామని, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వారికి పసందైన విందును ఏర్పాటు చేస్తామన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చే అతిథుల కోసం ఆంధ్ర ఆతిథ్యం అదిరిపోవాలని స్పీకర్ సూచించారు. తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డిని అయ్యన్నపాత్రుడు అభినందించారు. తుడా పరిధిలోని తొమ్మిది నియోజకవర్గాల్లోని 700 పైగా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు తుడా అప్రూవల్స్ అనుమతులు, అక్రమ లేఔట్లు, అక్రమ భవన నిర్మాణాల గుర్తింపు తదితర అంశాలపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ప్రత్యేకంగా అభినందించారు.



శ్రీవారి సేవలో అయ్యన్నపాత్రుడు

తిరుమల : శ్రీవారిని అయ్యన్నపాత్రుడు బుధవారం ఉదయం విఐపి సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. తీర్థప్రసాదాలు అందజేసి, శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయం లోపల మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం నష్టపోయిన రాష్ట్రం ఇపుడిపుడే అభివృద్ధివైపు అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించే శక్తిని సిఎం చంద్రబాబుకు ఇవ్వాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డ్రమ్స్ శివమణి, సినీ నిర్మాత సునీల్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ జనరల్ సెక్రటరీ శ్రీధర్ కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కర్ణాటక ప్రతిపక్ష నేత అశోక్ సైతం శ్రీవారిని దర్శించుకున్నారు.



సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికే గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ అన్నారు. బుధవారం కార్వేటినగరంలో పంచాయతీ ఈవో నాగరత్నమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వార్డు మెంబర్లు, కార్యదర్శులు విధిగా గుర్తించి, పంచాయతీ దృష్టికి తీసుకురావాలని అప్పుడే వాటికి పరిష్కారం లభిస్తుందని సూచించారు. అనంతరం ఈవో నాగరత్నమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పీ-4 సర్వేను సమగ్రంగా నిర్వహించి నిజమైన నిరుపేదలను గుర్తించాలన్నారు. పీ-4 సర్వే ప్రకారం ఏసీలు, ఫ్రిడ్జీలు, కూలర్లు, టీవీలు ఉండకూడదని, అలాగే నాలుగు ఎకరాలు మెట్టభూమి, 3 ఎకరాలు పుంజ భూమి ఉన్న కూడా సర్వే ప్రకారం ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు కారన్నారు. ఇలాంటి సర్వేపై ప్రత్యేక దృష్టి సారించి సిబ్బందికి కేటాయించన సమయానికి నివేదికను అందించాలని ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీవో మధుసూధన్, కార్యదర్శి సెల్వి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో

హాకింగ్స్ స్కూల్ విద్యార్థికి స్టేట్ 3వ ర్యాంక్



విద్యార్థిని సన్మానిస్తున్న స్కూల్ యాజమాన్యం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : స్థానిక హాకింగ్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాయి చరణ్ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల ఛైర్మెన్, కరస్పాండెంట్ హఫీజ్ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో విజేత సాయి చరణ్‌ను, అతని తల్లిదండ్రులను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. పాఠశాల ఛైర్మెన్ మాట్లాడుతూ చిన్నతనం నుండే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలని, ఆ లక్ష్యాలను సాధించే దిశగా బాల్యం నుండే పునాదులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిన విద్యార్థిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరూ విజేతగా నిలిచిన సాయిచరణ్‌ను ఆదర్శంగా తీసుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ షబ్బీర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణాసింగ్ చౌహన్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జి కారిడార్ ఏర్పాటు

టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు

ప్రజాశక్తి- శాంతిపురం: కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని మాజీ శాసనమండలి సభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గౌని వారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ల కృషి ఫలితంగా వేల కోట్ల పెట్టుబడులతో పలు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతున్నదన్నారు. తల్లికి వందనం కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో అమలు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, అమరావతి డిక్లరేషన్ను విడుదల చేశారన్నారు. 2030 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మార్చేందుకు అవసరమైన ప్రణాళికలను ప్రకటిస్తూ డిక్లరేషన్ రూపొందించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

గురజాల ఇంటికి కర్నాటక ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఇంటికి బుధవారం కర్ణాటక రాష్ట్ర శాసనసభ, ప్రతిపక్ష నేత ఎమ్మెల్యే ఆర్.అశోక్, దొడ్డబల్లాపూర ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని సాదరంగా ఆహ్వానించి ప్రజాప్రతినిధులు, స్థానిక టిడిపి నాయకులకు పరిచయం చేశారు. అల్పాహారం అనంతరం వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందించారు.

చెత్త సేకరణపై స్థానికులకు అవగాహన



ప్రజాశక్తి- కార్వేటినగరం: పరిసరాల పరిశుభ్రత బాధ్యత ప్రజలదేనని జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీడీ కండ్రిగలో నిర్వహించిన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని జెడ్పీ సీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల బాధ్యతను స్థానిక ప్రజలే వహించాలని, అప్పుడే చెత్తరహిత గ్రామాలు ఏర్పాటు అవుతాయని అన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం అందించిన బుట్టలలో తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. జిల్లా స్థాయిలో విధులు నిర్వహిస్తున్న సచివాల సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే టీకేఎం.పేట గ్రామంలో పర్యటించి మురుగునీరు నిల్వలు లేకుండా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, డిప్యూటీ ఎంపీడీవో మధుసూధన్, కార్యదర్శులు ఏకాంబరం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారు పేరు ఎన్‌సిసి



ప్రజాశక్తి- కార్వేటినగరం: దేశ భక్తికి, క్రమశిక్షణకు మారు పేరు ఎన్‌సిసి విభాగమని ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం ఉమాశంకర్ అన్నారు. బుధవారం ఎన్సీసీ అధికారుల ఆధ్వర్యంలో 35వ బెటాలియన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి హెచ్ఎం మాట్లాడుతూ ఎన్సీసీ ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ పెరగడమే కాకుండా విద్యాభ్యసంలో కూడా మార్పు వస్తుందన్నారు. అనంతరం పాఠశాల హిందీ ఉపాధ్యాయులు తారకరామా మాట్లాడుతూ ఎన్సీసీ విభాగానికి తాను కేర్టేకర్గా పనిచేస్తానని విద్యార్థులకు ఎన్సీసీ వల్ల కలిగే లాభాలను వివరించారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్యం, దేహదారుఢ్యం వంటి వివిధ పరీక్షలు నిర్వహించి 10 మంది బాలికలు, 15 మంది బాలురను ఎంపిక చేసి జూనియర్ డివిజన్‌గా ఏర్పాటు చేశారు.


షాదీమహల్ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి- శాంతిపురం: మండలంలోని మఠం పంచాయతీ పరిధిలోని కెపి.మిట్ట గ్రామంలో షాదీమహల్ నిర్మించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గ్రామస్తులు కోరారు. దీనిపై ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కె.పి. మిట్ట గ్రామంలో గ్రామస్తులతో కలిసి ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ నిర్మాణంకు స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని పరిశీలించి దీనిపై అంచనా నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ షాదీమహల్ నిర్మాణం వలన చుట్టుపక్కల గ్రామాల వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. షాదీమహల్‌ను అధునాతన పద్ధతిలో నిర్మించుటకు అంచనాలు తయారు చేసి అందజేయాలని గ్రామస్తులు ఎంపీడీవోను కోరారు. అలాగే గ్రామంలో ఎగువ ప్రాంతంలో ఉన్న వారికి సక్రమంగా తాగునీరు సరఫరా కావడం లేదని కొత్త బోరు మంజూరు చేయాలని కోరారు. సర్పంచ్ మురళి, జయపాల్, నూరుల్లా, చాంద్ బాషా, యారబ్, రసూల్, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.



సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ప్రజాప్రతినిధులు, స్థానిక టిడిపి నాయకులతో కలిసి 31, 32, 33, 34 వార్డుల్లో పర్యటించారు. రాంనగర్ కాలనీలో పర్యటన సందర్భంగా 99 ఏళ్ల రాజమ్మ ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గంగాకాలనీలో స్థలం ఉందని ఇల్లు కట్టుకోవాలని కోరగా ఎమ్మెల్యే స్పందించి కట్టిస్తానన్నారు. ఇద్దరు లబ్ధిదారులకు సొంత నిధులతో టీ స్టాల్ స్టాండ్ అందించారు. ఎమ్మెల్యే స్వయంగా టీ తయారు చేసి అందించారు. మేయర్ ఎస్.అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, కాజూరు బాలాజీ, రావూరి ఈశ్వరరావు పాల్గొన్నారు.



చిత్తూరులో..

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు



పూతలపట్టులో..

పూతలపట్టు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మురళి నాయుడు అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం మండల కేంద్రంలో గడపగడపకు తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ కరపత్రాలను పంచిపెట్టారు. తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం పథకం, యువతకు ఉద్యోగ అవకాశాలు, అన్న క్యాంటీన్లో పునరుద్ధరణ వంటి పథకాలకు కూటమి ప్రభుత్వం నాంది పలుకుతోందని ఆయన వివరించారు.

గంగాధర నెల్లూరు: ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణమ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం బుక్కాపట్నం, పాచిగుంట పంచాయతీలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు చేసిన అభివృద్ధిని కరపత్రాలను పంపిణీ చేసి వివరించారు. శ్రీధర్ యాదవ్, స్వామి దాస్,రఘు నాయుడు, వినోద్ నాయుడు, జ్యోతి యాదవ్, దేవసుందరం పాల్గొన్నారు.

లక్ష్మీ నగర్‌లో మౌలిక వసతులేవీ..?



బురదమయంగా ఉన్న కాలనీ రోడ్డు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డుకు చెందిన లక్ష్మీనగర్ ఎక్స్టెన్షన్ ఏరియాకు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ప్లాట్లు అమ్మి సొమ్ము చేసుకున్న రియల్టర్లు కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో దాదాపు 120 ఇళ్ళ నుంచి బయటకు వస్తున్న మురుగునీరు వీధుల గుండా ప్రవహిస్తున్నాయని, దీంతో ఉన్న కాస్త మట్టి రోడ్డు దుర్వాసనతో బురదమయంగా మారయని, వర్షం పడి నీరు చేరి కనీసం నడవడం కూడా కష్టంగా ఉందని కాలనీ వాసులు చెబుతున్నారు. ఈరోడ్లపై ద్విచక్ర వాహనాన్ని నడుపలేక బురదలో జారి పడిపోయిన సంఘటనలు అనేకంగా ఉన్నాయన్నారు. దీనికి తోడు వీధి లైట్లు లేకపోవడంతో పాములు, విష పురుగులు యథేచ్ఛగా ఇండ్లలో వచ్చేస్తున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి కొళాయి కనెక్షన్‌లు, పైపులైన్‌లు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వరి, వేరుశనగకు బీమా చేసుకోవాలి

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని తమ్మిరెడ్డిపల్లి గ్రామం తాళ్లపల్లి పంచాయతీలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ పాల్గొని రైతులకు పలు సూచనలు అందజేశారు. రైతులు ప్రతి ఒక్కరూ పంట బీబా చేసుకోవాలని, ముఖ్యంగా వరి పంట సాగు చేస్తున్న రైతులకు మీసేవ కేంద్రంలో ప్రీమియం చెల్లించి పంట బీమా నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులు యూరియా వాడకం తగ్గించాలని సేంద్రియ ఎరువులు వాడకం పెంచుకోవాలన్నారు. రైతులకు సేంద్రియ ఎరువుల్లో భాగంగా రైతులు జనుము, జిలుగా ఉపయోగించాలన్నారు. రైతులు పట్టుపురుగుల సాగు చేపట్టాలని మండల సిరికల్చర్ అధికారి తెలిపారు. సాగుకుగాను ప్రభుత్వం రాయితీ కింద రూ.22,500లు ఇస్తున్నదని దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండల వ్యవసాయ అధికారి రాఖీబా, మండల ఉద్యాన అధికారి వరప్రసాద్, మండల పశుసంవర్ధక శాఖ అధికారి రైతులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని మారేపల్లి గ్రామంలో రైతులకు పెరటి తోటల పెంపకం, నానో యూరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం కూరగాయల విత్తనాలు రైతులకు సరఫరా చేశారు. రైతులందరూ ఈ పంట కార్యక్రమం చేసుకోవాలని, కౌలు రైతు సర్టిఫికెట్లు తీసుకోవాలని, వరి, వేరుశనగ వంటి పంటలకు పంటల బీమా చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ డి.ఉమా, జిల్లా వనరుల శాఖ ఏడీఏ నాగపద్మిని, వ్యవసాయ అధికారి వనజ సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



గంగవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు, అధికారులు

అడవి కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి



అడవి కుక్కల దాడిలో మరణించిన గొర్రెలు


ప్రజాశక్తి- శాంతిపురం: మండల పరిధిలోని చెంగుబల్ల గ్రామం వద్ద మంగళవారం రాత్రి అడవి కుక్కలు దాడిలో 20 గొర్రెలు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. చెంగుబల్ల గ్రామానికి చెందిన కృష్ణప్ప గొర్రెల పెంపకం ద్వారా జీవనోపాధి చేసుకుంటున్నాడు. అతని వద్ద ఉన్న 37 గొర్రెలను షెడ్డులో వదిలి నిద్రిస్తుండగా మంగళవారం రాత్రి అడవి కుక్కలు చొరబడి గొర్రెలపై దాడి చేశాయి. ఈ దాడిలో 20 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. బుధవారం ఉదయం షెడ్యూల్లో గొర్రెలు మృతి చెంది ఉండడానికి గమనించి చిరుత దాడి చేసి ఉంటుందని అనుమానంతో ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎఫ్ఆర్ఓ జయశంకర్, తహశీల్దార్ శివయ్య, వెటర్నరీ డాక్టర్ ఆమని మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. మృతిచెందిన గొర్రెలను వెటర్నరీ డాక్టర్ పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అడవి కుక్కల దాడితోనే గొర్రెలు మృతి చెందినట్లు ఎఫ్ఆర్ఓ వెటర్నరీ డాక్టరు నిర్ధారించారు. గొర్రెల మృతి కారణంగా రూ.3లక్షలు వరకు నష్టం వాటిల్లినట్లు రైతు కృష్ణప్ప తెలిపారు. తమను ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

కృష్ణప్ప మృతికి పలువురి నివాళి



ప్రజాశక్తి- పెద్దపంజాణి: వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు, రాజుపల్లె ఎంపీటీసీ మునీశ్వరి భర్త కృష్ణప్ప మంగళవారం రాత్రి మృతి చెందారు. స్థానిక నాయకుల సమాచారంతో జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు బుధవారం హాజరయ్య మృతుని స్వగ్రామమైన కమ్మినాయనిపల్లికి వచ్చి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన మృతి వైస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. కృష్ణప్ప మృతదేహానికి ఎంపీపీ రెడ్డప్ప, మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, ఎంపీడీఓ బాలాజీ, సింగిల్ విండో ఛైర్మన్ శ్రీరాములు, భానుప్రతాప్ రెడ్డి, తమ్మిరెడ్డి, తదితరులు నివాళులు అర్పించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయనపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న కొత్త ఇండ్లు గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడు గుర్రప్ప అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మొగసాల రెడ్డప్ప స్థానిక సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ కార్తికేయన్, బూత్ కమిటీ అధ్యక్షులు షాకీర్, బీసీ సెల్ అధ్యక్షులు పీరులు గుర్రప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

గంగమ్మ గుడి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పాతపేట తాలూకా కచేరి వీధిలో ఉన్న శ్రీసత్య గంగమ్మ గుడి హుండీ లెక్కింపు ద్వారా రూ.1,80,770లు ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ అధికారి కమలాకర్ తెలియజేశారు. నాలుగు నెలల పదిరోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకలు రూ.1,80.770లు ఆదాయం వచ్చిందన్నారు. దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి కే.కమలాకర్, మదనపల్లి డివిజన్ దేవాలయ శాఖ తనిఖీదారు, గుమస్తా భాస్కర్ రెడ్డి, పి.శశి కుమార్ పాల్గొన్నారు.